సాక్షి యాదాద్రి భువనగిరి

గురువారం । 9 । మే । 2024

I



ప్రలోభాలకు లోనుకావద్దు

ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టర్ హనుమంతు కే.జండగె అన్నారు. - IIలో



రైతులను ఆదుకోవాలి

అకాల వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని బీఆర్ఎస్, సీపీఎం, సీపీఐ నాయకులు కోరారు. - IIIలో

గరిష్టం / కనిష్టం

37° / 27°

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

యాదాద్రిలో సంప్రదాయ పూజలు



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో బుధవారం సంప్రదాయ పూజలు శాస్త్రోక్తంగా చేపట్టారు. వేకువ జామున ప్రధానాలయాన్ని తెరిచిన అర్చకులు.. సుప్రభాత సేవ చేపట్టారు. అనంతరం స్వయంభూ, ప్రతిష్టా మూర్తులకు అర్చనలు, అభిషేకం చేశారు. ఇ ఆలయ ముఖ మండపంలో అష్టోత్తర పూజలు, ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహనసేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర కైంకర్యాలు గావించారు. సువర్ణ పుష్పార్చన, వేద ఆశీర్వచనం, నిత్యకల్యాణంలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి శ్రీస్వామి వారికి శయనోత్సవం చేసి ఆలయాన్ని మూసివేశారు.

రెండు రోజులు మద్యం దుకాణాలు బంద్

భువనగిరి టౌన్ : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా రెండు రోజుల పాటు మద్యం, కల్లు దుకాణాలు, కల్లు డిపోలు బంద్ చేయనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కే.జెండగే బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. 11 సాయంత్రం 5 నుంచి 13వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు బంద్ ఉంటాయన్నారు. అలాగే జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు బంద్ పాటించాలన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే ప్రజా ప్రాతినిధ్య చట్టం చట్టప్రకారం తీసుకోనున్నట్లు హెచ్చరించారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులపై సమీక్ష



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గంగాధర్

భువనగిరిటౌన్ : పోలింగ్ సిబ్బంది, ఓటర్లకు ఇబ్బంది కలగకుండా పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్ సూచించారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లో ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశమై పోలింగ్ కేంద్రాల్లో కల్పిస్తున్న సౌకర్యాలపై సమీక్షించారు. పోలింగ్ ప్రక్రియకు ఆటంకం కలగకుండా ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు వసతులు ఉండాలని, పోలింగ్ సిబ్బందికి భోజన సౌకర్యం కల్పించాలని పేర్కొన్నారు.

బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ఓటు అడిగే హక్కు లేదు

ఆలేరురూరల్ : మనువాద బీజేపీకి, మాదిగలకు ద్రోహం చేసిన కాంగ్రెస్ పార్టీకి ఓటు అడిగే హక్కు లేదని ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కొల్లూరు వెంకటేష్ అన్నారు. ఆలేరులోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు గ్యార నరేష్ అధ్యక్షతన బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రిజర్వేషన్లు తొలగిస్తామమని బీజేపీ, మాదిగలకు ఒక్క ఎంపీ టికెట్ కేటాయించకుండా కాంగ్రెస్ తమ సామాజిక వర్గాన్ని అవమానపరిచిందని ఆరోపించారు. మాదిగలు, ఉపకులాలు బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చింతల శంకర్, నియోజకవర్గ ఇన్‌చార్జి గ్యాదపాక మల్లేష్, పరశురాములు, సుధాకర్, ఎర్ర విజయ్, సిలువేరు అశోక్, కృష్ణ, సురేందర్, తిరుమలేష్, విజయ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

సగం కూడా కొనలే!

ధాన్యం కొనుగోళ్లలో ఎడతెగని జాప్యం

- 4.50 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ లక్ష్యం
- ఇప్పటి వరకు 1.80 లక్షల మెట్రిక్ టన్నులే కొనుగోలు
- కాంటా వేసిన వడ్లను తరలించడంలోనూ ఆలస్యమే
- అకాల వర్షాలకు ఆగమాగం
- దయనీయ స్థితిలో రైతులు



భూదాన్‌పోచంపల్లిలోని పీఏసీఎస్ కేంద్రంలో కాంటా వేయని ధాన్యం



గుండాల మండలం మాసాన్‌పల్లికి చెందిన పిల్లలమర్రి సత్యనారాయణ స్థానిక కొనుగోలు కేంద్రానికి 20 రోజుల క్రితం ధాన్యం తీసుకువచ్చాడు. 15 రోజుల క్రితమే వడ్లను కాంటా వేశారు. కానీ, లారీలు రాకపోవడంతో కొనుగోలు కేంద్రంలోనే ధాన్యం మూలుగుతోంది. అకాల వర్షానికి కాంటా వేసిన ధాన్యం పూర్తిగా తడిసింది. లారీలను రప్పించి ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని రైతు కోరుతున్నాడు.



భూదాన్‌పోచంపల్లి పరిధిలోని ముక్తాపూర్‌కు చెందిన రైతు గొలుగొండ శ్రీశైలం రెండు ఎకరాల్లో వరి సాగు చేశాడు. 20 రోజుల క్రితం పోచంపల్లి పీఏసీఎస్ కేంద్రానికి ధాన్యం తీసుకువచ్చాడు. ఇప్పటి వరకు ధాన్యం కాంటా వేయలేదు. కేంద్రంలో సుమారు 100 వరకు వడ్ల రాశులు ఉన్నాయి. లారీల కొరత కారణంగా కొనుగోళ్లు సరిగా జరగడం లేదని, నాలుగు రోజులుగా పూర్తిగా నిలిచిపోయాయయని రైతు శ్రీశైలం ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. వర్షాలు కురుస్తుండడంతో ఆందోళన చెందుతున్నాడు.

సాక్షి, యాదాద్రి : యాసంగి ధాన్యం కొనుగోళ్లలో ఎడతెగని జాప్యం జరుగుతోంది. కొనుగోలు కేంద్రాలు తెరిచి 40 రోజులు దాటిపోయింది. అయినా 1.80లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారు. ఇంకా 2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంది. తూకం వేసి సిద్ధంగా ఉంచి ధాన్యాన్ని కూడా మిల్లులకు చేర్చే అవకాశాలు కరువయ్యాయి. లారీలు, హమాలీల కొరత, మిల్లర్ల కొర్రీలు, మిల్లుల్లో స్థలాభావం వెరసి కొనుగోళ్ల జాప్యానికి ప్రధాన కారణాలుగా తెలుస్తోంది.

లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం కేంద్రాల్లోనే..

జిల్లాలో 4.50లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలన్నది పౌరసరఫరాల శాఖ లక్ష్యం.362 కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 1.80లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. ప్రైవేట్‌కు పోను ఇంకా 2 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పేరుకుపోయింది. కొనుగోళ్లలో జరుగుతున్న జాప్యం వల్ల రైతులు రోజుల తరబడి కేంద్రాల్లోనే నిరీక్షిస్తున్నారు. మరోవైపు కాంటా వేసిన ధాన్యం ఎగుమతి, దిగుమతిలో తీవ్ర జాప్యం జరుగుతోంది. సేకరించిన వడ్లలో సగానికి పైగా మిల్లులకు తరలించకపోవడంతో కొనుగోలు కేంద్రాల్లోనే మూలుగుతోంది. కొనుగోలు చేయని ధాన్యంతో పాటు కాంటా వేసిన వడ్లు వర్షాలకు తడుస్తున్నాయి.



గుండాలలో తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టిన దృశ్యం

జాప్యానికి కారణాలు

జిల్లాలోని రైస్ మిల్లులన్నీ ధాన్యంతో నిండుగా ఉన్నాయి. గత యాసంగికి చెందిన 1.80 లక్షల మెట్రిక్ టన్నులు, వానాకాలం సీఎంఆర్ సుమారు 1.90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఇంకా మిల్లుల్లోనే ఉండడంతో స్థలం కొరత ఏర్పడింది. దీంతో ధాన్యం నిల్వ చేసే పరిస్థితి లేకపోవడం వల్ల కొనుగోళ్లు మందకొడిగా సాగుతున్నాయి. దీనికి తోడు ఎఫ్‌సీఐ గోదాముల్లో సీఎంఆర్ ధాన్యం దించుకోవడంలో జాప్యం జరుగుతుండడం కూడా కొనుగోళ్లపై ప్రభావం చూపుతోంది. దీంతో ఇతర జిల్లాల మిల్లులకు ధాన్యం ఎగుమతి చేయడానికి అధికారులు చర్యలు ప్రారంభించారు. అంతేకాకుండా సకాలంలో లారీలు రాకపోవడం వల్ల కాంటా వేసిన ధాన్యం ఎగుమతి చేయలేకపోతున్నారు. మిల్లులకు తరలించిన ధాన్యాన్ని వెంటనే దిగుమతి చేసుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి.

రోడ్డెక్కిన రైతులు

ధాన్యం కొనుగోళ్లలో జాప్యాన్ని నిరసిస్తూ భూదాన్‌పోచంపల్లి మండలం జలాల్‌పురం, అడ్డగూడూరు మండలం చౌల్లరామారం రైతులు రోడ్డెక్కారు. చౌల్లరామారంలో రోడ్డుపై వడ్లు పోసి నిరసన తెలిపారు.

ఆస్తి, పంట నష్టం ఇలా..

అకాల వర్షానికి జిల్లాలో పెద్ద ఎత్తున నష్టం వాటిల్లింది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవడంతో పాటు ఉద్యాన తోటలు దెబ్బతిన్నాయి. ఆత్మూరు(ఎం) మండలంలోని పోసానికుంటతో పాటు పలు గ్రామాల్లో మామిడి కాయలు నేలరాలాయి. ఈదురుగాలులకు దూదివెంకటపురం - సోమారం గ్రామాల మధ్య చెట్లు నేలకూలాయి.

- బొమ్మలరామారం మండలంలో సుమారు 50 ఎకరాల్లో మామిడికాయలు నేలరాలాయి.
- గుండాల మండలంలో పలుచోట్ల కాంటా వేసిన ధాన్యం తడిసింది.దీంతో రైతులు ధాన్యాన్ని ఆరబెట్టారు.



బొమ్మలరామారంలో నేలరాలిన మామిడి కాయలు

- ఆలేరు మండలం శారాజీపేటలో కరెంట్ తీగలు తెగి చెట్లపై పడ్డాయి. కొలనుపాక జైన్ మందిరంలో భారీ వృక్షాలు కూలిపోయాయి. శర్బనాపురంలో సైదాపురం భాస్కర్, సీత కిష్టయ్య ఇంటి కప్పు రేకులు ఎగిరిపోయాయి.
- భువనగిరి మండలం, బీబీనగర్ మండలంలోని బ్రాహ్మణపల్లి, చిన్నరావులపల్లి ఎర్రబెట్టి తండా, ముగ్దంపల్లి, జంపల్లి గ్రామాల్లో సుమారు 15 వేల బస్తాలకు పైగా కాంటవేసిన ధాన్యం తడిసింది. కాంటా వేయని ధాన్యం కూడా తడిసి ముద్దయ్యింది. అలాగే మాదారం, జమీలాపేట, వెంకిర్యాలలో మామిడి కాయలు నేలరాలయి.
- రామన్నపేట మండలంలోని పలు గ్రామాల్లో మామిడి నేలరాలింది. వెల్లంకిలో వనం ఉపేందర్ ఇంటిపై చెట్టు కూలడంతో ఇంటి కప్పు ధ్వంసమైంది.

నేడు భువనగిరికి అమిత్‌షా

- రాయగిరిలో జరిగే బహిరంగ సభకు హాజరుకానున్న కేంద్ర హోం మంత్రి
- జన సమీకరణకు బీజేపీ సన్నాహాలు



సభా స్థలిలో కొనసాగుతున్న ఏర్పాట్లు

సాక్షి, యాదాద్రి : కేంద్ర హోం మంత్రి అమిత్‌షా గురువారం భువనగిరికి రానున్నారు. బీజేపీ ఎంపీ భ్యర్థి బూర నర్సయ్యగౌడ్‌కు మద్దతుగా రాయగిరిలో ఉదయం నిర్వహించనున్న బహిరంగ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించనున్నారు. సభ విజయవంతానికి పార్టీ యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది.

50 వేల మందితో సభ

బహిరంగ సభకు 50 వేల మందిని సమీకరించేందుకు పార్టీ నేతలు సన్నాహాలు చేస్తున్నారు. లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల నుంచి జనాన్ని తరలించనున్నారు. ఆహూతుల కోసం భారీ వేదిక ఏర్పాటు చేస్తున్నారు. జనం కూర్చోవడానికి జర్మన్ టెంట్‌లు వేస్తున్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా సభకు వచ్చేవారి కోసం మంచినీళ్లతో పాటు మజ్జిగ ప్యాకెట్లను సిద్ధం చేస్తున్నారు.

పటిష్ట పోలీసు బందోబస్తు

కేంద్ర హోంశాఖ మంత్రి రాకను పురస్కరించుకొని పోలీసు శాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తుంది. పోలీసు బలగాలు సభాస్థలిని తమ అధీనంలోకి తీసుకుని తనిఖీలు చేపట్టాయి.

దూకుడు పెంచిన బీజేపీ

ఎన్నికల ప్రచారంలో బీజేపీ మరింత దూకుడు పెంచింది. ప్రచారానికి మరో మూడు రోజులే సమయం మిగిలి ఉండడంతో అగ్రనేతలను రంగంలోకి దింపుతోంది. ఈనెల మొదటి వారంలో చౌటుప్పల్‌కు ప్రధాని నరేంద్రమోదీ రావల్సి ఉండగా అనివార్య కారణాల వల్ల ఆయన పర్యటన రద్దయ్యింది. 6వ తేదీన చౌటుప్పల్ పరిధి తంగడపల్లిలో నిర్వహించిన బహిరంగ సభకు పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గురువారం భువనగిరి మున్సిపాలిటీ పరిధి రాయగిరిలో నిర్వహించనున్న బహిరంగ సభకు అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ముఖ్య అతిథిగా విచ్చేస్తున్నారు. ప్రచారానికి గడువు ముగిసేలోపు ఉత్తరాదికి చెందిన ముఖ్యమంత్రి ప్రచారానికి వచ్చే అవకాశం ఉందని పార్టీ నాయకులు చెబుతున్నారు. ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా సర్వశక్తులొడ్డుతున్న బీజేపీ.. ప్రతి అవకాశాన్ని వినియోగించుకుంటుంది.

1,266 మంది హోం ఓటింగ్ వినియోగం

భువనగిరి టౌన్ : లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఈనెల 3వ తేదీ నుంచి కొనసాగుతున్న హోం ఓటింగ్ బుధవారం ముగిసింది. ఇంటి వద్దనుంచి ఓటు హక్కు వినియోగించుకునేందుకు మొత్తం 1,363 మంది దరఖాస్తు చేసుకోగా 1,266 మంది ఓటు వేశారు. 97 మంది ఓటు హక్కు వినియోగించుకోలేదు.

పోస్టల్ బ్యాలెట్ గడువు పొడిగింపు

పోలింగ్ విధుల్లో పాల్గొంటున్న ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు గడువును మరో రెండు రోజుల పాటు ఎన్నికల సంఘం పొడిగించింది. 8వ తేదీన గడువు ముగిసినప్పటికీ ఓటింగ్ శాతం పెంచే చర్యల్లో భాగంగా 10వ తేదీ సాయంత్రం 5గంటల వరకు ఓటు వేసే వెసులుబాటు కల్పించింది. భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో మొత్తం 13,213 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఉండగా 10,468 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. బుధవారం 2,403 మంది ఓటు వేశారు. ఇంకా 2,745 ఓట్లు పోల్ కావాల్సి ఉంది.

రామన్నపేటలో 'దోస్త్' సహాయ కేంద్రం

రామన్నపేట : ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ప్రవేశం పొందడానికి విద్యార్థుల సౌకర్యార్థం రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో జిల్లాస్థాయి దోస్త్ సహాయ కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రహత్‌ఖానమ్ ప్రారంభించారు. కళాశాలల్లో అడ్మిషన్ కోసం విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకునే సమయంలో ఏవైనా సాంకేతిక సమస్యలు, ఇబ్బందులు తలెత్తితే సహాయ కేంద్రంలో పరిష్కరించనున్నట్లు ప్రిన్సిపల్ తెలిపారు. విద్యార్థుల ఆధార్‌కు మొబైల్ నంబర్ అనుసంధానమై ఉండాలని, టెన్త్ మార్కుల మెమో, ఇంటర్ సెకండియర్ హాల్‌టికెట్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, 3వ తరగతి నుంచి స్టడీ సర్టిఫికెట్ తీసుకురావాలని సూచించారు.వివరాలకు యాదగిరి 9948649049, ఎస్‌కే.హారీఫ్ 9676759155, నవీన్ 9490911910ను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలోమాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బెల్లి యాదయ్య, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి, దోస్త్ కోఆర్డినేటర్ డాక్టర్ ఆర్.యాదగిరి, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ బాలనర్సింహ, కమిటీ సభ్యులు కిషన్, డాక్టర్ అనీత పాల్గొన్నారు.

పాత కలెక్టరేట్‌లోనే మెడికల్ కాలేజీ

- అందుబాటులో లేని అనువైన భవనాలు
- తాత్కాలికంగా పాత కలెక్టరేట్‌లోనే కళాశాల ఏర్పాటుకు చర్యలు



పగిడిపల్లిలోని పాత కలెక్టరేట్ భవనం

భువనగిరి : జిల్లాకు మంజూరైన మెడికల్ కళాశాలను పాత కలెక్టరేట్ భవనంలోనే ఏర్పాటు చేయనున్నారు. మెడికల్ కళాశాల ఏర్పాటుకు తొలుత ఇదే భవనాన్ని ఎంపిక చేశారు. అయితే జాతీయ వైద్య మండలి నిబంధనల ప్రకారం మెడికల్ కళాశాల ఏర్పాటు చేయాలంటే భవన సముదాయం లక్ష నుంచి 1.30 లక్షల ఎస్ఎఫ్‌టీల వరకు ఉండాలి. కానీ, భువనగిరి శివారు పగిడిపల్లి గ్రామ పరిధిలో ఉన్న పాత కలెక్టరేట్ భవనం కేవలం 55వేల ఎస్ఎఫ్‌టీలు మాత్రమే ఉంది. దీంతో జాతీయ వైద్య మండలి ఆదేశాల మేరకు అధికారులు పాత కలెక్టరేట్‌కు బదులు అనంతారం పరిధిలోని ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలలు, రాయగిరి పరిధిలోని ఇంజనీరింగ్ కళాశాల, పగిడిపల్లి పరిధిలో ఉన్న ఇంజనీరింగ్ కళాశాల భవనాలను పరిశీలించారు. కానీ, ఆ భవనాలన్నీ మెడికల్ కళాశాల ఏర్పాటుకు అనువుగా లేవు. దీంతో, ప్రస్తుతానికి పాత కలెక్టరేట్ భవనంలోనే తాత్కాలికంగా మెడికల్ కళాశాలను ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు.

అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు

పాత కలెక్టరేట్ భవనాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. త్వరలోనే యాజమాన్యంతో మాట్లాడి భవనానికి మరమ్మతులు చేయనున్నట్లు మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ మల్లికార్జున్ తెలిపారు.

'పది'కి సంసిద్ధత

తొమ్మిదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు ప్రత్యేక కార్యక్రమం

- టెన్త్ సిలబస్‌లోని ప్రధాన అంశాలపై ఆన్‌లైన్ తరగతులు
- వేసవి సెలవుల్లో సమయం వృథా చేయకుండా కార్యాచరణ



ఆన్‌లైన్ తరగతుల్లో ఇచ్చిన ప్రశ్నలకు సమాధానాలు రాస్తున్న విద్యార్థులు

భువనగిరి : తొమ్మిదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులను విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే పదో తరగతికి సంసిద్ధులను చేస్తున్నారు. ఇందు కోసం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏప్రిల్ 24నుంచి సంసిద్ధత పేరుతో ప్రత్యేక కార్యక్రమం ప్రారంభించారు. వేసవి సెలవుల్లో సమయాన్ని వృథా చేయకుండా పదో తరగతికి సంబంధించిన ముఖ్యమైన అంశాలను పునశ్చరణ చేయిస్తున్నారు. గత రెండేళ్ల నుంచి 100 శాతం ఫలితాలు లక్ష్యంగా కృషి చేస్తున్నా లక్ష్యానికి చేరువకావడం లేదు. ఈ నేపథ్యంలో రానున్న విద్యా సంవత్సరంపై జిల్లా విద్యాశాఖ ఇప్పటినుంచే దృష్టా సారించింది. ఇందులో భాగంగానే ముందస్తుగా విద్యార్థులను సిద్ధం చేస్తోంది.


టెన్త్ విద్యార్థులు 4,834 మంది

జిల్లాలో అన్ని రకాల ప్రభుత్వ పాఠశాలలు 712 ఉన్నాయి. వీటిలో ప్రభుత్వ, జెడ్పీ ఉన్నత 163, ప్రాథమికోన్నత 68, ప్రాథమిక పాఠశాలలు 481 ఉన్నాయి. వీటితో పాటు కేజీబీవీలు 11, ఆదర్శ 7,బీసీ గురుకుల, మైనార్టీ, రెస్సిడెన్సియల్ స్కూళ్లు సుమారు 10వరకు ఉన్నాయి.ఆయా పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి గాను పదో తరగతి విద్యార్థులు 4,834 మంది ఉన్నారు.

ఆన్‌లైన్ తరగతులు ఇలా..

ఏప్రిల్ 24 నుంచి పాఠశాలలకు వేసవి సెలవులు ప్రారంభమయ్యాయి. సుమారు 49 రోజుల పాటు సెలవులు ఉండనున్నాయి. విద్యార్థులు ఈ సమయాన్ని వృథా చేయకుండా 40 రోజుల పాటు పునశ్చరణ తరగతులు నిర్వహించాలని భావించిన జిల్లా విద్యాశాఖ అధికారులు.. సంసిద్ధత పేరుతో ఆన్‌లైన్ తరగతులను ప్రారంభించారు. ఆదివారం మినహా మిగిలిన రోజుల్లో రోజూ రెండు సబ్జెక్టుల చొప్పున సుమారు గంట పాటు ఆన్‌లైన్ తరగతులు నిర్వహిస్తున్నారు. ముఖ్యమైన అంశాలపై సబ్జెక్ట్ ఉపాధ్యాయులు వీడియోలను రూపొందించి డీసీఈబీకి పంపితే వాటిని పరిశీలించి ప్రధానోపాధ్యాయుల వాట్సప్‌కు పంపుతారు. యూట్యూబ్‌కు లింక్ ఇచ్చి తద్వారా విద్యార్థులు తరగతులు వినేలా ఏర్పాటు చేశారు. అనంతరం పీడీఎఫ్ వర్క్ షీట్‌ను పంపిణీ చేసి తిరిగి వాటిపై విద్యార్థులు సమాధానాలు పంపేలా చేస్తున్నారు. ప్రధానంగా సబ్జెక్టులకు సంబంధించిన ప్రాథమిక సమాచారం, ప్రధాన సూత్రాలపై మాత్రమే ఆన్‌లైన్ తరగతులు నిర్వహిస్తున్నారు. సంసిద్ధత కార్యక్రమం ద్వారా తొమ్మిదో తరగతి పాసైన విద్యార్థులు ముందుగానే పదో తరగతికి ఉపయోగపడే ప్రధాన అంశాలను నేర్చుకోవడానికి దోహదపడుతుంది.

సమయాన్ని వృథా చేయవద్దనే..



వేసవి సెలవుల్లో విద్యార్థులు సమయాన్ని వృథా చేయవద్దనే ఉద్దేశంతో సంసిద్ధ కార్యక్రమం పేరుతో ఆన్‌లైన్ తరగతులు నిర్వహిస్తున్నాం. రోజుకు రెండు సబ్జెక్టుల చొప్పున సుమారు గంట పాటు ఆన్‌లైన్ తరగతులు, పీడీఎఫ్ వర్క్ ఉంటుంది. పాఠశాలల పునఃప్రారంభం వరకు ఆన్‌లైన్ తరగతులు కొనసాగుతాయి. పదో తరగతి సిలబస్‌కు సంబంధించి ప్రాథమిక సమాచారం, సూత్రాలు, వాక్యరణాలు, గ్రామర్, మ్యాప్ పాయింటింగ్ తదితర అంశాలపై తరగతులు నిర్వహిస్తారు. ఇది విద్యార్థులకు పునశ్చరణగా ఉంటుంది.

–నారాయణరెడ్డి, డీఈఓ

కాంగ్రెస్ ఖాతాలోకి అడ్డగూడూరు పీఏసీఎస్

- నెగ్గిన అవిశ్వాస తీర్మానం
- నూతన చైర్మన్‌గా కొప్పుల నిరంజన్‌రెడ్డి



నూతన చైర్మన్ నిరంజన్‌రెడ్డి

అడ్డగూడూరు : అడ్డగూడూరు పీఏసీఎస్ చైర్మన్‌గా కాంగ్రెస్ పార్టీకి చెందిన కొప్పుల నిరంజన్‌రెడ్డి ఎన్నికయ్యారు. అప్పటి చైర్మన్ పొన్నాల వెంకటేశ్వర్లుపై కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. బుధవారం ఉదయం 11గంటలకు స్థానిక పీఏసీఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో డీసీఓ ప్రవీణ్‌కుమార్ సమక్షంలో ఓటింగ్ నిర్వహించారు. పీఏసీఎస్‌లో 13 మంది డైరెక్టర్లుగా ఉండగా వైస్ చైర్మన్ చేడే చంద్రయ్య, 8మంది డైరెక్టర్లు సమావేశానికి హాజరయ్యారు.



అవిశ్వాసానికి మద్దతుగా చేతులెత్తిన డైరెక్టర్లు

అవిశ్వాసానికి మద్దతుగా తొమ్మిది మంది డైరెక్టర్లు చేతులు ఎత్తారు. దీంతో అవిశ్వాసం నెగ్గినట్లు డీసీఓ ప్రకటించారు.

జనవరి 9న డీసీఓకు నోటీస్ అందజేత

పీఏసీఎస్‌లో కాంగ్రెస్‌కు 6, బీఆర్ఎస్ 6, సీపీఐకి ఒకరు చొప్పున డైరెక్టర్లు ఉన్నారు. చైర్మన్‌గా బీఆర్ఎస్ డైరెక్టర్ పొన్నాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్‌గా సీపీఐ డైరెక్టర్ చెడే చంద్రయ్య ఎన్నికయ్యారు. తదనంతరం చోటు చేసుకున్న పరిణామాలతో తొమ్మిది మంది డైరెక్టర్లు చైర్మన్‌పై అవిశ్వాసం ప్రకటిస్తూ జనవరి 22వ తేదీన డీసీఓకు సంతకాలతో కూడిన నోటీస్ అందజేశారు. మరుసటి రోజునుంచి 9 మంది డైరెక్టర్లు క్యాంపునకు వెళ్లారు. ఫిబ్రవరి 9న అవిశ్వాసం కోసం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయగా పొన్నాల వెంకటేశ్వర్లు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో న్యాయస్థానం స్టే ఇస్తూ తీర్పు వెలువరించింది. ఇటీవల కోర్టు స్టే ఎత్తివేయడంతో పాటు అవిశ్వాస సమావేశం ఏర్పాటు చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు డీసీఓ బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించి ఓటింగ్ నిర్వహించగా.. తొమ్మిది మంది డైరెక్టర్లు మాజరై కొప్పుల నిరంజన్‌రెడ్డికి మద్దతు తెలిపారు. దీంతో నిరంజన్‌రెడ్డి చైర్మన్‌గా ఎన్నికైనట్లు డీసీఓ ప్రకటించారు.

హాజరుకాని డైరెక్టర్లు వీరే..

చైర్మన్ పొన్నాల వెంటకటేశ్వర్లతో పాటు ఎల్లంల వీరస్వామి, బాలెంల ఎల్లమ్మ, పోగులు నర్సిరెడ్డి అవిశ్వాస సమావేశానికి గైర్హాజరయ్యారు.

తగ్గిన ఉష్ణోగ్రతలు

- సాధారణం కంటే 5 డిగ్రీలు తక్కువ నమోదు

భువనగిరిటౌన్ : పది రోజులుగా నిప్పులు కురిపించిన భానుడు కాస్త శాంతించాడు. బుధవారం ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు పడిపోయాయి. సాధారణం కంటే 5 డిగ్రీలు తక్కువగా నమోదయ్యాయి. అత్యధికంగా రాజాపేటలో 40 డిగ్రీలు, అత్యల్పంగా రామన్నపేటలో 35 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. యాదగిరిగుట్టలో 39.9, బొమ్మలరామారం మండలం మర్యాల, భూదాన్‌పోచంపల్లి మండలాల్లో 39.2, భువనగిరిలో 38.9, ఆత్మకూర్ (ఎం) మండల కేంద్రంలో 37 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత రికార్డ్ అయ్యింది.

రేకులు, చలువ పందిళ్ల పునరుద్ధరణ

యాదగిరిగుట్ట : జిల్లాలో మంగళవారం రాత్రి వీచిన ఈదురుగాలులకు యాదాద్రి కొండపై చలువ పందిళ్లు కూలిపోవడం, టెంట్ రేకులు ఎగిరిపోవడంతో వాటిని తిరిగి పునరుద్ధరిస్తున్నారు. క్యూకాంప్లెక్స్ పైభాగంలో రేకులు లేచిపోయిన ప్రాంతంలో కవర్లు కప్పి తాళ్లతో కడుతున్నారు. అలాగే ర్యాంప్, మాఢ వీధుల్లో చలువ పందిళ్లు కూలిపోవడంతో వాటిని తొలగించి కొత్తవి వేస్తున్నారు. ఉత్తర మాఢ వీధిలో ఏర్పాటు చేసిన తాత్కాలిక టెంట్ కదలడంతో తాళ్లతో బిగిస్తున్నారు. ఇక కొండ కింద లక్ష్మీ పుష్కరిణిలో చెత్తాచెదారం చేరడంతో ఆ నీటిని తొలగించి తిరిగి నింపుతున్నారు.



ఈదురు గాలులకు లేచిపోయిన టెంట్ రేకులను తిరిగి ఏర్పాటు చేస్తున్న దేవస్థానం సిబ్బంది

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

ఫెసిలిటేషన్ కేంద్రాలు మరో రెండ్రోజులు పొడిగింపు

● సూర్యాపేట కలెక్టర్ ఎస్. వెంకటరావు

భానుపురి (సూర్యాపేట): ఎన్నికల విధులు కేటాయించిన సిబ్బంది ఓటు హక్కు వినియోగించుకునేలా ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రాలను మరో రెండు రోజులు పొడిగించినట్లు సూర్యాపేట జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్. వెంకటరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొదట 8వ తేదీ వరకు ఉండగా.. 10వ తేదీ వరకు పొడిగించినట్లు తెలిపారు. ఎన్నికల విధులు కేటాయించిన ఉద్యోగులు, సిబ్బంది, పోలీసులు ఫెసిలిటేషన్ కేంద్రాలకు వెళ్లి పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.



కొనసాగుతున్న హోం ఓటింగ్

నల్లగొండ : హోం ఓటింగ్‌లో భాగంగా బుధవారం నాటికి జిల్లాలో 85 సంవత్సరాలు పైబడిన వారు 770 మంది ఓటు వేసినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి దాసరి హరిచందన ఒక ప్రకటనలో తెలిపారు. 1194 మంది దివ్యాంగులు ఓటు వేసినట్లు ఆమె పేర్కొన్నారు. అత్యవసర సేవలకు సంబంధించిన ఉద్యోగులు 44 మంది ఓటు వేశారని, జిల్లాలో ఏర్పాటు చేసిన ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రాల ద్వారా 11488 మంది ఉద్యోగులు ఓటు వేసినట్లు ఆమె వెల్లడించారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి

● నల్లగొండ ఎస్పీ చందనా దీప్తి

నల్లగొండ క్రైం: లోక్‌సభ ఎన్నికల పోలింగ్ సమయం దగ్గరపడుతుండడంతో జిల్లా పోలీసు యంత్రాంగం సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై దృష్టి పెట్టినట్లు నల్లగొండ జిల్లా ఎస్పీ చందనా దీప్తి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే పాత నేరస్తులను కట్టడి చేసేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణ రూపొందించిందన్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 693మంది పాత నేరస్తులు, రౌడీ షీటర్స్‌ని బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు. వారి కదలికలపై నిఘా ఉంచామన్నారు. ఎవరైనా బైండోవర్ ఉల్లంఘించి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

దేశంలోనే అత్యధిక మెజార్టీ ఇవ్వాలి

● మాజీ మంత్రి జానారెడ్డి

పెద్దవూర: ఇన్నేళ్లు తనను ఆదరించినట్లుగానే తన కుమారుడు కుందూరు రఘువీర్‌రెడ్డిని ఆశీర్వదించి దేశంలోనే అత్యధిక మెజార్టీ ఇచ్చి ఢిల్లీకి పంపాలని మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి అన్నారు. బుధవారం రాత్రి పెద్దవూర మండల కేంద్రంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ కార్నర్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. గత శాసనసభ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలను ఎలా మట్టికరిపించారో అదేవిధంగా లోక్‌సభ ఎన్నికల్లోనూ ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి మాట్లాడుతూ.. పంద్రాగస్టులోగా రైతు రుణమాఫీని కచ్చితంగా అమలు చేసి తీరుతామన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు జానారెడ్డి కుటుంబం గురించి ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని, వారు నోరు అదుపులో పెట్టుకోవాలన్నారు. ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఇప్పటికే 5 గ్యారంటీలను రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిందని, త్వరలోనే ఆరో గ్యారంటీని కూడా అమలు చేస్తామని అన్నారు. హస్తం గుర్తుపై ఓటు వేసి తనను ఎంపీగా గెలిపించాలని కోరారు. అనంతరం కాంగ్రెస్ కార్యకర్తలు వారిని గజమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, మాజీ ఎంపీపీ రమావత్ శంకర్‌నాయక్, టి. చంద్రశేఖర్‌రెడ్డి, పబ్బు యాదగిరి, రవీందర్‌రెడ్డి, వినయ్‌రెడ్డి, చామల సువర్ణ, రామాంజిరెడ్డి, వెంకన్న, సీపీఎం నాయకుడు కూన్‌రెడ్డి నాగిరెడ్డి, ముత్యాల్‌రెడ్డి, సతీష్, కిలారి మురళీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి జానారెడ్డి, పక్కన ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి

● పతి కోసం సతి ప్రచారం



చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించాలంటూ భువనగిరిలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న ఆయన సతీమణి డింపుల్‌రెడ్డి.

● 'మహాలక్ష్మి' జర గుర్తుంచుకో..!



ప్రచారంలో భాగంగా భువనగిరిలో బస్సులో వెళ్తున్న మహిళలను ఓటు అభ్యర్థిస్తున్న చామల కిరణ్‌కుమార్‌రెడ్డి. - భువనగిరి టౌన్

ప్రలోభాలకు లోనుకావద్దు

● యాదాద్రి భువనగిరి కలెక్టర్ హనుమంతు కే.జెండగె



ఫ్లాగ్ మార్చ్ అనంతరం ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ హనుమంతు కే.జెండగె

భువనగిరి క్రైం: ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని యాదాద్రి భువనగిరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కే.జండగె పేర్కొన్నారు. బుధవారం రాయగిరిలో పోలీసులు నిర్వహించిన ఫ్లాగ్ మార్చ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు వజ్రాయుధం లాంటిందని, ప్రతి ఒక్కరూ ఓటు వేయడం బాధ్యతగా భావించాలని, ఏ ఒక్కరూ విస్మరించరాదని కోరారు. ఎన్నికల సంఘం పోలింగ్ సమయాన్ని అదనంగా గంట పాటు పొడిగించిందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రతి ఒక్కరూ ఓటు వేయాలని కోరారు. వృద్ధులు, దివ్యాంగుల కోసం పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. తాగు నీటి సౌకర్యంతో పాటు మెడికల్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచనున్నట్లు వెల్లడించారు. డీసీపీ రాజేశ్‌చంద్ర మాట్లాడుతూ.. ఎవరైనా ప్రలోభాలకు గురిచేసినా, ఎన్నికల నిబంధనలు అతిక్రమించినా సీవిజిల్ యాప్ ద్వారా, 1950 నంబర్ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ అమరేందర్, అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ, ఏసీపీ రవికిరణ్‌రెడ్డి, సీపీ ప్రభాకర్‌రెడ్డి, ఎస్‌హెచ్‌ఓ సంతోష్ కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్‌ను నిశితంగా గమనించాలి

సాక్షి, యాదాద్రి : పోలింగ్ ప్రక్రియను నిశితంగా గమనించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కే.జెండగే మైక్రో అబ్జర్వర్లకు సూచించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మైక్రో అబ్జర్వర్లతో సమావేశమయ్యారు. పోలింగ్ విధులపై అవగాహన కల్పించారు. పోలింగ్ రోజు ప్రతి రెండు గంటలకు ఒకసారి సాధారణ పరిశీలకులకు నివేదికలు అందజేయాలన్నారు. మాక్ పోలింగ్ మొదలుకొని ఈవీఎంలను స్ట్రాంగ్ రూంలకు తరలించే వరకు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

బలమైన ఆర్థిక శక్తిగా ఎదిగిన భారత్

● బీజేపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి

హుజూర్‌నగర్ (చింతలపాలెం): ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ ప్రపంచంలోనే బలమైన ఆర్థిక శక్తిగా ఎదిగిందని బీజేపీ జాతీయ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి అన్నారు. బీజేపీ నల్లగొండ ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి తరఫున బుధవారం చింతలపాలెంలో ఆయన ఎన్నికల ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గం అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు వెళ్లాలంటే సైదిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. దేశంలో ఎన్నో కోట్ల మందికి సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత ప్రధాని నరేంద్ర మోదీకే దక్కిందని అన్నారు. ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి మాట్లాడుతూ.. అవినీతి రహిత భారతదేశ నిర్మాణం బీజేపీ గెలుపుతోనే సాధ్యమన్నారు. మూడోసారి కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు కాబోతోందని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో దొంగ హామీలతో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, కాంగ్రెస్ పార్టీకి దిశా నిర్దేశం చేసే నాయకత్వం లేదని ఎద్దేవా చేశారు. దేశంలో బీజేపీ గెలుపొందే 400 సీట్లలో నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గం ఒకటని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొబ్బా భాగ్యరెడ్డి, నాయకులు చల్లా శ్రీలత, వీరబాబు, పి. విజయ్, అంబళ్ల నరేష్, లింగరాజు, ఎం. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



చింతలపాలెంలో రోడ్ షోలో పాల్గొన్న పొంగులేటి సుధాకర్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి

● 'గీత' మారుస్తాం



మద్దిరాల మండలం ముకుందాపురంలో కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించాలని గీత కార్మికులను ఓటు అభ్యర్థిస్తున్న నాయకులు

తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి

● బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్

భువనగిరి రూరల్: వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని బీఆర్ఎస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం ఆయన భువనగిరి మండలంలోని బస్వాపురం గ్రామంలో ఐకేపీ సెంటర్ వద్ద అకాల వర్షానికి తడిసిన వరి ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ధాన్యం కొనుగోలు విషయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రెండు నెలలుగా ధాన్యం కొనుగోలు చేయడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.



వర్షానికి తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న క్యామ మల్లేష్, జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి

పట్టభద్రుల స్థానానికి 19మంది నామినేషన్లు దాఖలు



నామినేషన్ దాఖలు చేస్తున్న విద్యార్థుల రాజకీయ పార్టీ అభ్యర్థి పాలకూరి అశోక్‌కుమార్



నామినేషన్ సమర్పిస్తున్న తెలంగాణ రిపబ్లిక్ పార్టీ అభ్యర్థి గుండమల్ల జ్యోతి

● నామినేషన్ల స్వీకరణకు నేడు ఆఖరు తేదీ

నల్లగొండ: ఖమ్మం-వరంగల్-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు సంబంధించి బుధవారం 19మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. వీరంతా నల్లగొండ కలెక్టరేట్‌లో రిటర్నింగ్ ఆఫీసర్, కలెక్టర్ దాసరి హరిచందననుకు నామినేషన్ల పత్రాలు అందజేశారు.

నేటితో ఆఖరు..

ఈనెల 3వ తేదీ నుంచి కొనసాగుతున్న నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ గురువారంతో ముగియనున్నట్లు అధికారులు తెలిపారు. కాగా ఇప్పటి వరకు మొత్తం 67మంది నామినేషన్లు దాఖలు చేసినట్లు పేర్కొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థిగా ప్రేమేందర్‌రెడ్డి

● నేడు నామినేషన్ వేయనున్న 'గుజ్జుల'

హన్మకొండ: నల్లగొండ-వరంగల్-ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి బీజేపీ అభ్యర్థిగా గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని అధిష్టానం బుధవారం ప్రకటించింది. వరంగల్‌లో బీఎస్సీ, ఉస్మానియా యూనివర్సిటీలో ఎమ్మెస్సీ ఫిలాసఫీ, మరత్వాడ యూనివర్సిటీలో ఎల్‌ఎల్‌బీ పూర్తి చేసిన ప్రేమేందర్‌రెడ్డి విద్యార్థి ఉద్యమాల్లో పాల్గొన్నారు. ఏబీవీపీలో పలు పదవులు నిర్వహించారు. బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు. పూర్వ వరంగల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా, తర్వాత రాష్ట్ర కార్యదర్శిగా, ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. 12 ఏళ్లుగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. తెలంగాణ ఉద్యమంలోనూ ప్రేమేందర్‌రెడ్డి కీలక పాత్ర పోషించారు.

రెండోసారి ఎమ్మెల్సీ బరిలో..

2004లో శాయంపేట నియోజకవర్గం నుంచి, 2009లో పరకాల నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేశారు. 2021లో జరిగిన నల్లగొండ-వరంగల్-ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీచేశారు. ఆ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి విజయం సాధించగా.. జనగామ ఎమ్మెల్యేగా ఎన్నికైన అనంతరం పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. దీంతో ఉప ఎన్నిక జరుగుతోంది. ఈ ఉప ఎన్నికలో గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి మరోసారి బరిలోకి దిగుతున్నారు. గురువారం ఆయన నల్లగొండలో నామినేషన్ వేయనున్నారు. బీజేపీ నుంచి పూర్వ వరంగల్ జిల్లా నుంచి పీఆర్టీయూ మాజీ అధ్యక్షుడు, బీజేపీ రిటైర్డ్ ఎంప్లాయీస్ సెల్ రాష్ట్ర కోకన్వీనర్ పులి సరోత్తంరెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, అధికార ప్రతినిధి ప్రకాశ్‌రెడ్డి టికెట్ ఆశించగా.. పార్టీ అధిష్టానం చివరికి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డికి అవకాశం కల్పించింది.



గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి

రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలి

పెన్‌పహాడ్: రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలని కేవీకే మృత్తిక శాస్త్రవేత్త ఎ.కిరణ్ తెలిపారు. బుధవారం మండల పరిధిలోని లింగాల గ్రామంలో భూసార పరీక్షకు మట్టి నమూనా సేకరించే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రతి రెండు సంవత్సరాలకు ఒక్కసారి ప్రతి రైతు తమ భూమి మట్టి నమూనాను సేకరించి భూసార పరీక్ష చేయించుకొని దానికి అనుగుణంగా ఎరువులు వాడాలని సూచించారు. ఎండాకాలం తొలకరి వర్షాలకు లోతైన వేసవి దుక్కులు చేసుకొని పశువుల ఎరువులు, పచ్చిరొట్ట ఎరువులు వేసుకుంటే భూసారం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో కేవీకే సిబ్బంది బచ్చు వెంకటేశ్వర్లు, రైతులు జి.సుధాకర్‌రెడ్డి, ఆర్.కృష్ణయ్య, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

అద్దంకి దయాకర్‌పై చర్య తీసుకోవాలి

నల్లగొండక్రైం: హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ నాయకుడు అద్దంకి దయాకర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బుధవారం నల్లగొండ టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో పలువురు న్యాయవాదులు ఫిర్యాదు చేశారు. పాకిస్థాన్‌ను ప్రేమిస్తానని వివాదాస్పద వ్యాఖ్యలు చేసినందుకు చర్యలు తీసుకోవాలని న్యాయవాదులు సూర్యసంపత్, నాగరాజు, రాఘవ, అంజిరెడ్డి, హరిరామ్, రాంప్రసాద్, వసంతరావు, వెంకటయ్య, శ్రీనివాస్, నవీన్‌లు ఫిర్యాదు పేర్కొన్నారు.



టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న న్యాయవాదులు

విద్యుదాఘాతంతో మహిళ మృతి

సూర్యాపేట: మండలంలోని బాలెంల గ్రామంలో బుధవారం విద్యుదాఘాతంతో మహిళ మృతి చెందింది. వివరాలు.. బాలెంల గ్రామానికి చెందిన శివరాత్రి అంజమ్మ(45) ఇంట్లో దండెంపై బట్టలు ఆరేస్తుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందింది. ఆమెకు కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. భర్త యాదగిరి పదేళ్ల క్రితం అనారోగ్యంతో మరణించాడు.

చింతపల్లిలో మరొకరు..

చింతపల్లి : విద్యుదాఘాతంతో ఓ కార్మికుడు మృతి చెందగా పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన చింతపల్లి మండలంలోని కుర్మేడు ఎక్స్‌రోడ్డు వద్ద బుధవారం జరిగింది. వివరాలు.. కుర్మేడు ఎక్స్‌రోడ్డు వద్ద ఉన్న ఓ హోటల్‌లో ఏపీలోని ఒంగోలుకు చెందిన ఆరుగురు కార్మికులు విద్యుత్ బోర్డును బిగిస్తుండగా విద్యుదాఘాతానికి గురై ఓ కార్మికుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మరో నలుగురికి గాయాలు కాగా ఒకరి పరిస్థితి విషమంగా ఉంది.

గోడ కూలి వ్యక్తి దుర్మరణం



సత్తయ్య (ఫైల్)

తిరుమలగిరి (తుంగతుర్తి) : గోడ కూలి వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. తిరుమలగిరి పట్టణానికి చెందిన పాలబిందెల సత్తయ్య(45) తాపీమేస్త్రీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం సత్తయ్య ఓ ఇంటికి గోడ కడుతుండగా.. సాయంత్రం భారీ వర్షం, ఈదురుగాలులు వీచినప్పుడు గోడ కూలి అతడిపై పడటంతో తీవ్రగాయాలయ్యాయి. అతడిని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారులు ఉన్నారు.

అప్పుల బాధతో యువరైతు ఆత్మహత్య



శంకర్ (ఫైల్)

గుర్రంపోడు : అప్పుల బాధతో పురుగుల మందు తాగి యువ రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన గుర్రంపోడు మండలం నడికూడ గ్రామంలో బుధవారం జరిగింది. ఎస్ఐ శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. నడికూడ గ్రామానికి చెందిన మారేపల్లి శంకర్(33) తనకు ఉన్న రెండెకరాల భూమితో పాటు మరో పదెకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. ఈ ఏడాది వర్షాలు లేక సరైన పంట దిగుబడి రాలేదు. దీంతో అప్పులు తీర్చే మార్గం కనిపించక మనస్తాపంతో ఈనెల 4న గ్రామశివారులోని తాటిచెరువు వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అటుగా వెళ్లిన గ్రామస్తులు శంకర్‌ను గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వెంటనే వారు నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. శంకర్ భార్య మారేపల్లి అశ్విని ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎట్టకేలకు వడ్డె ఎల్లయ్య మృతదేహం లభ్యం

● జగ్గయ్యపేట మండలం బండిపాలెం గ్రామశివారులో సగం కాలిన మృతదేహాన్ని గుర్తించిన పోలీసులు

● తహసీల్దార్, కుటుంబ సభ్యుల సమక్షంలో పోస్టుమార్టం



ఎల్లయ్య (ఫైల్)

సూర్యాపేట, జగ్గయ్యపేట: గత నెల 19న కిడ్నాప్‌కు గురైన సూర్యాపేట జిల్లా సైనికపురి కాలనీకి చెందిన వడ్డె ఎల్లయ్య (58) మృతదేహాన్ని ఎట్టకేలకు బుధవారం జగ్గయ్యపేట మండలంలోని బండిపాలెం గ్రామ అటవీ ప్రాంతంలో పోలీసులు గుర్తించారు. వివరాల ప్రకారం.. జగ్గయ్యపేటలో ఎల్లయ్యను గత నెల 19న కిడ్నాప్ చేశారంటూ అతడి సోదరుడు సతీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక సీఐ జానకిరామ్ ఆధ్వర్యంలో పట్టణ ఎస్ఐలు సూర్యభగవాన్, పద్మారావు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో భాగంగా అదే ప్రాంతానికి చెందిన తాడోజు శ్రీకాంత్‌రాజు(చారి) కొందరి సహాయంతో జగ్గయ్యపేటలో భార్యభర్తల గొడవ ఉందని ఎల్లయ్యను తీసుకువచ్చి ఓ ఇంట్లో హత్య చేసి మృతదేహాన్ని కనిపించకుండా చేసినట్లు ఈనెల 2న శ్రీకాంతరాజు పోలీసుల ఎదుట ఒప్పుకున్నాడు. దీంతో అతడిని కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించారు.

అటవీ ప్రాంతంలో మృతదేహం లభ్యం..

ఎల్లయ్య మృతదేహం ఆచూకీ లేకపోవడంతోశ్రీకాంతరాజుకు సహకరించిన వారిని కొన్ని రోజులుగా పోలీసులు విచారిస్తుండడంతో బుధవారం వివరాలను వెల్లడించారు. జగ్గయ్యపేట మండలంలోని బండిపాలెం గ్రామ అటవీ ప్రాంతంలో కాల్చిపూడ్చి పెట్టినట్లు చెప్పడంతో పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి వెలికితీశారు. అయితే మృతదేహాన్ని పెట్రోల్ పోసి సగం కాల్చి పూడ్చి పెట్టడంతో పాటు 20రోజులు గడుస్తుండటంతో గుర్తుపట్టలేని విధంగా మారింది. అతడి ఒంటి మీద ఉన్న వస్తువులు ఆధారంగా భార్య యాదమ్మ తన భర్తగా గుర్తించింది. దీంతో పోలీసులు మృతదేహాన్ని జగ్గయ్యపేట ప్రభుత్వాసుపత్రికి తరలించి తహసీల్దార్ శేషగిరి సమక్షంలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

సుఫారి ఇచ్చే నాతండ్రిని హత్య చేశారు..

సుఫారీ ఇచ్చే నాతండ్రిని హత్య చేశారని మృతుడి కుమార్తె అమల విలేకరుల ఎదుట బోరున విలపించింది. తన తండ్రిని రాజకీయంగా ఎదుర్కోలేక తాడోజు శ్రీకాంతరాజు, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్య, బొడ్డు కిరణ్, చింతలపాటి మధు, ఒంటెద్దు నిర్మల, వాణిశ్రీ హత్య చేయించారని పేర్కొంది.

మాచిరెడ్డిపల్లిలో భారీ బందోబస్తు

నాగారం: వడ్డె ఎల్లయ్య హత్య ఘటనలో ప్రధాన నిందితుడైన తాడోజు శ్రీకాంత్‌రాజు స్వగ్రామం నాగారం మండలం మాచిరెడ్డిపల్లిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బుధవారం భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు నాగారం సర్కిల్ సీఐ రఘువీర్ రెడ్డి తెలిపారు.

పోలీసు పహారాలో ముగిసిన అంత్యక్రియలు

సూర్యాపేట : ఎల్లయ్య మృతదేహాన్ని జగ్గయ్యపేట నుంచి అంబులెన్స్‌లో సూర్యాపేట మండలంలోని ఆయన స్వగ్రామం యర్కారానికి బుధవారం తీసుకొచ్చారు. ఎల్లయ్య అంత్యక్రియలు పోలీసు పహారాలో రాత్రి ముగిశాయి. ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా అదనపు ఎస్పీ నాగేశ్వరరావు, డీఎస్పీ రవి, సీఐ సురేందర్‌రెడ్డి, రాజశేఖర్, బాలునాయక్‌తో పాటుగా మరో నలుగురు సీఐలు, పది మంది ఎస్ఐలతో భారీ బందోబస్తు చేపట్టారు. ఎల్లయ్య మృతదేహానికి మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ శాఖ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు కొప్పుల వేణారెడ్డి ఆయన నివాసానికి వెళ్లి మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు.



యర్కారంలో పహారా కాస్తున్న పోలీసులు

మద్యం పట్టివేత

రామగిరి(నల్లగొండ): అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై తిప్పర్తి పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం.. తిప్పర్తి మండల కేంద్రానికి చెందిన మారగోని పార్వతమ్మ కిరాణ దుకాణంలో మద్యం విక్రయిస్తున్నట్లు పక్కా సమాచారం అందడంతో పోలీసులు ఆమె షాపులో తనిఖీలు నిర్వహించి 14 ఫుల్‌బాటిళ్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఆమెపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజు తెలిపారు. అక్రమంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.